## 'తప్పుడు కేసులు నమోదు చేస్తున్న ప్రభుత్వం'




మాట్లాడుతున్న బూర్క వెంకటయ్య


కేసముద్రం, మే 19: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని ఆ పార్టీ జిల్లా నాయకుడు గౌని ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరెపల్లి సమీపంలో పోలీసులు అరెస్టు చేసిన రాజన్న, దేవిరెడ్డి, జీవన్‌తోపాటు మరి కొందరిని, వారి ప్రాణానికి ఎలాటి హాని తలపెట్టకుండా చట్ట ప్రకారం కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు శివ్వారపు శ్రీధర్, కొట్టం అంజయ్య, బట్టు నాగేశ్వర్‌రావు, మహ్మద్ మదార్, బట్టుమేకల రాజు, బెజ్జంకి బ్రహ్మచారి, మునిగంటి సుధాకర్, బండి రాజు ఉన్నారు.

### అజ్ఞాత దళ నాయకులను కోర్టులో హాజరుపర్చాలి

కొత్తగూడ: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకులు, మరో నలుగురు కామ్రేడ్‌లను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని మహబూబాబాద్ జిల్లా ఎన్డీ నాయకుడు బూర్క వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీ అజ్ఞాత దళ నాయకులు రాజన్న, దేవిరెడ్డి, మరో నలుగురిని వరంగల్ పోలీసులు అరెస్టు చేశారని, వారికి ఎలాంటి ప్రాణ హాని తలపెట్టకుండా తక్షణమే కోర్టులో హాజరుపర్చాలన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామిక వాధులు ఖండించాలన్నారు. సమావేశంలో ఎన్డీ కొత్తగూడ సబ్‌డివిజన్ కమిటీ నాయకులు యాదగిరి, యుగేంధర్, మంగన్న, నారాయణ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా వీరన్న

మహబూబాబాద్, మే 19 : ఈ నెల 27 న నిర్వహించనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సమన్వయ కర్తగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన సిరిపురం వీరన్నను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, బలరాంనాయక్, శ్రీకాంత్‌రెడ్డి, దిలీప్‌కుమార్, నాయకులు అయ్యప్పరెడ్డి, ఉదయ్‌చందర్, ప్రకాశ్‌రెడ్డి, సురేశ్‌నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







- ఇష్టారాజ్యంగా తరలిస్తున్న నిర్వాహకులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- పట్టించుకునే నాథుడే లేడంటున్న ప్రజలు

# ఇటుక బట్టీకి చెరువు మట్టి

నెల్లికుదురు, మే 19: పంట పొలాల సారవంతం పెంచేందుకు వినియోగించాల్సిన చెరువు మట్టిని కొందరు తమ సొంత వ్యాపారాలకు ఇష్టారాజ్యంగా తరలించుకుపోతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టనట్లు అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి గ్రామ శివారులో ఓ ఇటుక బట్టీ వ్యాపారి ఇటుక తయారీకి చెరువు మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటుక బట్టీ నిర్వహణకు బట్టీ యజమాని మేచరాజుపల్లి తూర్పు చెరువులో ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పులను తరలించారు. తరలించిన చెరువు మట్టిని బట్టీ వద్ద పెద్ద రాశులుగా నిల్వ చేస్తున్నాడు. పంట పొలాల సారవంతానికి తట్టెడు చెరువు మట్టిని తరలించడానికైతే నిబంధనలకు ప్రకారం.. ఐబీ, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పని సరి.. కానీ, నిబంధనలను అతిక్రమించి ఎలాంటి అనుమతి లేకుండా ఇటుక బట్టీ యజమాని చెరువు మట్టిని తరలిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వందల ట్రిప్పుల చెరువు మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీకి చెరువు మట్టిని తరలించిన బట్టీ నిర్వహకులపై అధికారులు సంబందిత చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శాసనమండలి పోస్టల్ బ్యాలెట్ కోసం ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు



కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్, మే 19: వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికలు ఈ నెల 27న జరుగనున్న నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఆర్డీవో కార్యాలయంలో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం పేర్కొన్నారు. ఈ సెంటర్ ఈ నెల 20 నుంచి 24 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. శాసన మండలి ఉప ఎన్నికలకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

## ఎయిడ్స్ నివారణపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్ రూరల్, మే 19: ఎయిడ్స్ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ రమేశ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ బారిన పడి మృతి చెందిన వారికి ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఏరియా దవాఖాన ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులతో పాటు విద్యావంతులు, మేధావులు గ్రామాల్లో ఎయిడ్స్ నివారణ, జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. బాధితులను ఆప్యాయంగా పలకరిస్తూ అండగా ఉండాలని, వారికి ప్రభుత్వం అందించే చేయూతను సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వోదయ మానిటరింగ్ టీమ్ సిబ్బంది విహాన్, సూర్య, శిరీష, సరస్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో పోరాడాలి

- ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు



తొర్రూరు: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం సభ్యులు



గార్ల: నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్

కురవి/ కేసముద్రం/ డోర్నకల్ /గార్ల / తొర్రూరు/ దంతాలపల్లి/ చిన్నగూడూరు, మే 19: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు పిలుపునిచ్చారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లాలోని మండలాల్లో ఆయన చిత్రపటానికి సీపీఎం, సీఐయూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, తాను నమ్మిన సిద్ధాంతాలకు చివరి వరకు కట్టుబడిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. దున్నేవానికి భూమి, వెట్టి చాకిరీ విముక్తి కావాలని, అంటరానితనం వివక్ష ఉండని సమాజం ఏర్పడాలని కోరుకున్నాడని, మార్పు కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించాడన్నారు. నేటి పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల శ్రమ దోపిడీ జరుగుతోందని, వేల ఎకరాల భూములు కార్పొరేట్, బడా పెట్టుబడిదారుల వద్ద కేంద్రీకరించబడుతున్నాయని తెలిపారు. సమసమాజ స్థాపన కోసం, సుందరయ్య కలలు కన్న విప్లవ సాధన కోసం కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, పేద మధ్యతరగతి ప్రజలు ఏకం కావాలన్నారు. సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కురవి, తాళ్లపూసపల్లిలో పార్టీ సీనియర్ నాయకుడు నాగయ్య, కేసముద్రంలో సీపీ ఎం జిల్లా కమిటీ సభ్యుడు మహేశ్, డోర్నకల్ రైల్వేస్టేషన్, గార్లలోని స్తూపం వద్ద, తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో, దంతాలపల్లి మండలం దాట్లగ్రామంలో, చిన్నగూడూరు మండల కేంద్రంలో పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దంతాలపల్లి, మే 19: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2006-07లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులు వేణుమధవ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీవీ రావు, రవి, సుధాకర్, కరుణాసాగర్, అనంతలక్ష్మిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా సందడి చేశారు. ఏండ్ల తర్వాత స్నేహితులు కలువడంతో ఆత్మీయ ఆలింగనం చేసుకొని ఆనందోత్సాహంలో మునిగితేలారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూణెం ప్రభాకర్

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కొత్తగూడ, మే 19: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రగతిశీల అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎంఎస్)జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం నిర్మాణ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రతి ఎకరాకు రూ.30వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని తక్షణమే కొనాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. వర్షాకాలంలో సరిపడ విత్తనాలు రైతాంగానికి అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంగాల పాపయ్య, ప్రధాన కార్యదర్శిగా ముద్రబోయిన కొమ్మాలు, మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి గొంది సమ్మయ్య, సంఘ మండల నాయకులు రాజు, వెంకన్న, పాపయ్య, శ్రీరాములు, వెంకన్న పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి కాడెద్దు మృతి

మహబూబాబాద్ రూరల్, మే 19: పురుగుల మందు తాగి కాడెద్లు మృతి చెందిన ఘటన మండల శివారులో జరిగింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. మండలంలోని అయోధ్య గ్రామ శివారు భజనతండాకు చెందిన రైతు తన ఆయిల్‌పామ్ తోటకు పురుగుల మందును బకెట్‌లో కలిపి పిచికారీ చేశాడు. సగం తోటకు పిచికారీ చేసి మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లాడు. ఈ క్రమంలో అదే తండాకు చెందిన ఏ సురేశ్, రమేశ్ కాడెడ్లు తోటలో మేతకు వెళ్లి బకెట్‌లో ఉన్న పురుగుల మందు తాగి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు సురేశ్ తెలిపాడు.

## ఇండ్ల స్థలాలకు హద్దులు కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నెల్లికుదురు, మే 19: ఇండ్ల నిర్మాణం కోసం ఇచ్చిన స్థలానికి హద్దు కేటాయించి ఇండ్లు మంజూరు చేయాలని రామన్నగూడెం లబ్ధిదారులు కొమురయ్య, ఏ నర్సయ్య, ఏ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని రామన్న గూడెంలో 1998 సంవత్సరంలో సర్వే నంబర్ 62లోని 3.3 ఎకరాల భూమిలో 60 మంది లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలను ఇచ్చిందన్నారు. హద్దులు కేటాయించకపోవడంతో వారు ఇండ్లు నిర్మించుకోలేకపోయారని, ఇప్పటికైనా లబ్ధిదారులకు హద్దులు కేటాయించి నిర్మాణానికి ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులు ఏ మైసయ్య, ఏ శ్రీను, ఎం రాములు, కే వెంకన్న, సీహెచ్ వీరస్వామి, శ్రీను పాల్గొన్నారు.

## ఆదివాసీల సమస్యలపై కమిషన్ వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

కొత్తగూడ, మే 19: లంబాడాలు, ఆదివాసీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ వేయాలని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం గోదావరి పరివాహక ప్రాంత ఆదివాసీల ఆత్మీయ కలయికలో భాగంగా పాకాల, కొత్తగూడ మండల కేంద్రంలో పర్యటించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976లో లంబాడాలను ఎస్టీ జాబితాలో కలిపి ఆదివాసీలకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీదే అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, 29 శాఖల జీవోలను చట్టం చేసేలా కృషి చేయాలన్నారు. ఆదివాసీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే హైదరాబాద్ స్థాయిలో ఉద్యమం చేస్తామని, ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాటాలు నిత్యం కొనసాగుతాయన్నారు.



కంఠమహేశ్వర స్వామికి పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

## కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నగూడూరు, మే 19: మండలంలోని జయ్యారం గ్రామంలో కంఠమహేశ్వర స్వామి వేడుకలను గౌడసంఘ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర స్వామికి జలాభిషేకం, ఇంటింటా బోనాలతో తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★I, HAREESH KUMAR AUKARAPU, S/o. AUKARAPU RAJA CHENNA VISWESWAR, R/o. H.No. 8-11-24, R.N.T. Road, Beside Andhra Bank, Warangal, Warangal Dist.-506002, T.S., India., have Changed my name as AUKARAPU HARISH KUMAR and solemnly declare.
NTW-00

WANTED
jobs Apply Now!
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# రెండు బైక్‌లు ఢీ..

### ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

గార్ల, మే 19: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బుద్ధారం అండర్ బ్రిడ్జి( ఆర్‌యూబీ) వద్ద ఆదివారం రాత్రి జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపురం తండాకు చెందిన ఇస్లావత్ అశోక్ బైక్‌పై గార్ల నుంచి ఇంటికి వెళ్తున్నాడు. అదే క్రమంలో ఇల్లెందు మండలం కొమరారం గ్రామానికి చెందిన భాస్కర్ భార్య, కుమార్తె అక్షితతో కలిసి బైక్‌పై డోర్నకల్ నుంచి వస్తుండగా అండర్ బ్రిడ్జి వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కర్, అక్షితకు తీవ్రగాయాలు కావడంతో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు. అశోక్ మృతదేహాన్ని గార్లకు తీసుకొచ్చారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

## తీన్మార్ మల్లన్నది బ్లాక్‌మెయిల్ రాజకీయం



విద్యార్థులను ఓటు అభ్యర్థిస్తున్న అభ్యర్థి జడ్సన్

మహబూబాబాద్ రూరల్, మే 19: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నది బ్లాక్ మెయిల్ రాజకీయమని స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ వీసీ అవినీతిపై గతంలో గవర్నర్‌కు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలను పెంచి పోషిస్తున్న ఇలాంటి వారినిపై చర్యలు తీసుకోవాలన్నారు.



బస్సులో సీట్ల కోసం జరిగిన ఘర్షణలో గాయపడిన ప్రయాణికుడు

# బస్సులో సీటు నాదంటే నాది..

### బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులో ఇరు వర్గాల ఘర్షణ

మహబూబాబాద్ రూరల్, మే 19 : బస్సులో సీటు నాదంటే.. నాది.. అని ప్రయాణికులు ఘర్షణ పడిన ఘటన ఆదివారం జరిగింది. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మధ్యాహ్నం నర్సంపేట బస్ పాయింట్ వద్దకు పల్లె వెలుగు బస్సు వచ్చి ఆగింది. ఈ క్రమంలో కొందరు కిటికీల నుంచి సీట్లల్లో టవల్స్ వేసి ఆపుకున్నారు. మరికొందరు బస్సులో ఎక్కి వారు ఆపిన సీట్లలో కూర్చున్నారు. దీంతో సీటు ఆపిన వారు వచ్చి గొడవకు దిగారు. ఇరు వర్గాల వారు కొట్లాటకు దిగగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను వారించినా వినలేదు. వెంటనే టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు వచ్చి ఘర్షణ పడిన ప్రయాణికులను స్టేషన్‌కు తీసుకెళ్లి సర్ది చెప్పి పంపించారు.

- గాలి, దుమారానికి కిందికి వేలాడుతున్న కరెంట్ తీగలు
- గ్రామాల్లో తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- మేతకోసం వెళ్లి విద్యుత్ షాక్‌కు గురవుతున్న జీవాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ట్రాన్స్‌కో సిబ్బంది
- ఆందోళన చెందుతున్న రైతులు

# అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవాలు బలి



పూమ్యా తండా సమీపంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదెలు (ఫైల్)



ఉయ్యాలవాడలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన పాడి ఆవు (ఫైల్)

డోర్నకల్, మే 19: విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం మూగజీవాలకు శాపంగా మారుతున్నది. జిల్లాలో వేసవిలో గాలి దుమారం, అకాల వర్షాలు పడుతుండడంతో గ్రామాలు, పొలాల వద్ద తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎర్త్ వైర్లు, స్తంభాలు ధ్వంసమై విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. వాటిని సరిచేయకపోవడంతో పశువులు మేతకోసం వెళ్లి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందుతున్నాయి. ఈ విషయంపై విద్యుత్ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్‌మెన్‌లకు, పైస్థాయి మండల ట్రాన్స్‌కో ఏఈలకు ఫిర్యాదు చేసినా తమ ఆవేదనను పెడ చెవిన పెడుతున్నారని, చిన్న సమస్యలను సైతం పరిష్కరిండంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొంటున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పశువులతో పాటు, రైతులు కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తున్నదని తెలిపారు. పశువుల మృతితో తమకు లక్షల రూపాయల నష్టం జరుగుతోందని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి పంట పొలాలు, గ్రామాల్లో కిందికి వేలాడుతున్న కరెంట్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే..

విద్యుత్ అధికారులు సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నరు. ట్రాన్స్‌ఫార్మర్లు కిందకి బిగించడంతో పశువులు మేతకోసం వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తులో ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-పఠాన్ ఖాజా, రైతు, పూమ్యాతండా